# ఈనాడు

## విషాద జగత్తు

మనిషి జీవితాన్ని ఒక్క ముక్కలో సమీక్షిస్తూ... 'సముద్రాలు దాటాడట కాళ్లు తడవకుండా, మనిషి- జీవితాన్ని దాటలేడు కళ్లు తడవకుండా' అన్నారొక యువ కవి. ఎత్తుపల్లాలు సుఖదుఃఖాలు సన్మాన అవమానాలు కలిమిలేములు... కలగలిసే ఉంటాయి. 'ఎంతవారికైనా తిప్పలు తప్పవు' అని సామెత. వారి అంటే జలప్రవాహం. తిప్పలు అంటే ఇసుక దిబ్బలు. ఎంతటి నిండు ప్రవాహాలైనా వాటిలో అక్కడక్కడ ఇసుకమేటలు తప్పవు. 'ఔను నిజం చేదువిషం జీవఫలం' అన్నాడు మహాకవి శ్రీశ్రీ. కాదనలేని నిజమది. ఎగుడుదిగుళ్లు ప్రతి మనిషికీ సహజమే అయినా, కొందరిని చూస్తుంటే ఎప్పుడూ నవ్వుతూ హాయిగా ఆనందంగా కనిపిస్తుంటారు. అనుక్షణం దుఃఖం ఓడుతూ ఉంటారు- మరికొందరు! కష్టంలో ఉన్నప్పుడు ప్రతి మనిషీ సహజంగానే ఇరుగుపొరుగు వారినుంచి ఓదార్పు ఆశిస్తాడు. దాంతో మనసు తేలికపడుతుంది. రాయప్రోలువారి నాయకుడి మాదిరి 'ఈ తృణ కంకణంబు ధరియింపుము... నీ ప్రణయ బాష్పజలాంజలి నింతయిచ్చి ఏ రీతిని వాడకుండ అలరింపుము' అంటూ, చాలామంది ఆ ఓదార్పు తీపికి అలవాటుపడిపోతారు. కనుక దుఃఖాన్ని ప్రేమిస్తారు. 'ఏమిటమ్మా అంత విచారంగా కూర్చున్నావు' అని తోటికోడలు మాటవరసకు పలకరిస్తే 'ఏం చెప్పమంటావక్కా! ఈ వారం మొత్తంలో తృప్తిగా ఏడ్చే అవకాశం ఒక్కటీ దక్కలేదు, నా బాధ ఎవరితో చెప్పుకోను' అంటూ నిజాయతీగా వాపోతారు. 'ఏడిచి ఎన్నాళ్లయినదీ ఎద! అశ్రులు కనుమోసులందు ఓడిచి ఎన్నినాళ్లయినదోయి' అని చింతించారు కృష్ణశాస్త్రి. కరవుతీరా ఏడ్చేస్తే అదో తృప్తి. దానికి అవకాశం రాకుంటే తీరని అసంతృప్తి. విచిత్రమైనది మనిషి ప్రవృత్తి.

మరికొందరుంటారు- 'ఆమె ముక్కెప్పుడును చీదినట్లు లేదు హస్తమున సూదిమందెక్కినట్లు లేదు' అని 'స్వప్నాల దుప్పటి' ఖండికలో ఉత్పలవారు చెప్పినట్లు 'పొరుగావిడను ఆమె మొగుడు ఎప్పుడూ కసురుకున్నట్లు లేదు, ఆమె ఒక్కసారీ గట్టిగా ఏడ్చినట్లు లేదు' అని ఆలోచిస్తూ నిత్యం విచారిస్తూ ఉంటారు. తనకు ఉన్నదాంతో సుఖంగా గడిచిపోతున్నా- పక్కవాడు సైతం తనంత సుఖంగానూ ఉండటం ఇంకొందరికి కంటగింపుగా ఉంటుంది. భారతంలో సుయోధనుడిది అచ్చంగా అదే స్థితి. ద్రౌపదితో వివాహం అయ్యాక పాండవులు అప్పనంగా అర్ధరాజ్యం గ్రహించారు. ధర్మజుడి పరిపాలన ప్రజారంజకమని గూఢచారులు చెబుతున్నారు. పైగా ఆయన ఊరికే ఉండక మహా వైభవంగా రాజసూయం నిర్వహించి జేజేలందుకున్నాడు. 'నిజద్యుతి యొప్పగ మూర్తమైన ధర్మమ్మును బోలెనున్న గుణమండితు, దీక్షితు, ధర్మనందనున్' చూసేసరికి సుయోధనుడికి కడుపు రగిలిపోయింది. ఎక్కడెక్కడి రాజులో వచ్చి ధర్మరాజుకు సమర్పిస్తున్న అమూల్య కానుకలను స్వయంగా చేత్తో అందుకొనే బాధ్యతను దుర్యోధనుడికి అప్పగించారు. అఖండమైన ఈ సంపదకు తోడు మయసభ శోభ ఒకటి. 'కందుగల పసిడి కాచిన కంది వివర్ణమయినట్లు... మలినాలతో కూడిన బంగారాన్ని పుటం పెడుతుంటే మరింత నల్లగా అయినట్లు' అని అతడి స్థితిని వర్ణించాడు నన్నయ. తట్టుకోలేక తండ్రి దగ్గరకు వెళ్ళి సుయోధనుడు 'సర్వరత్నాకరైక ప్రశస్త రత్నపుంజములకు ఆస్పదము- ధర్మపుత్రు గృహము' అని ఆక్రోశించాడు. తండ్రి నచ్చజెప్పాడు. 'అంతకన్నా నీకు ఎన్నోరెట్లు సంపద ఉంది. నీవూ ఏదైనా యాగాన్ని చేయరాదా' అన్నాడు. సుయోధనుడి బాధ- తనకు లేక కాదు, పాండునందనుడికీ చేకూరిందని! మనిషి అత్యంత విచారగ్రస్తుడు కావడానికి ముఖ్యమైన కారణాల్లో అసూయది అగ్రస్థానం.

'నాకు కరచరణాలు సవ్యంగా ఉన్నాయి... ఆరోగ్యంగా ఉన్నాను... అరుగుదల, జరుగుబాటు దివ్యంగా ఉన్నాయి. భార్య అనుకూలవతి... పిల్లలు గుణవంతులు... ఇవన్నీ నాకు అమూల్యమైన సంపదలే' అని గుర్తించడాన్ని 'ఐశ్వర్య చైతన్యం' అంటారు. అది లేకపోగా, తనకు ఏవి లేవో వాటి గురించే అనుక్షణం చింతిస్తూ ఉండటమే నిజమైన దారిద్ర్యం. అదే విచారానికీ, కోపానికీ మూలకారణం. 'దొర(భగవంతుడు) తనకెంతో ఇచ్చినను దుఃఖము తీరక చాలదంచు బిరబిర వచ్చి ఏడ్చుకొని పేలవమంతయు(హీనత్వాన్ని) వెల్లడించుచున్' శోకసముద్రంలో మునకలు వేస్తూ ఉండటం మనిషి బలహీనత. మనిషి విచారానికి ఎన్నో కారణాలు. 'అన్య విత్తాపేక్ష(పరాయి సొమ్ముపై కన్ను) ఆత్మవిత్త అపరిత్యాగము(తన సొత్తు చేజారకుండా తాపత్రయపడటం)- ఎవ్వని అంతరంగ గుణము' అలాంటివాడికి జీవితంలో దుఃఖం తప్పదన్నాడు శ్రీనాథుడు శృంగారనైషధంలో. 'జ్ఞాన ప్రదీపికా ఝుంఝూ సమీరంబు కామ లోభ క్రోధ కారణంబు...' మోహమనేది ఒక మంత్రదండం... జ్ఞానదీపాన్ని ఆర్పేసే ప్రచండ వాయువు' అన్నాడు. 'అత్యంత గాఢ దంతాగ్ర పీడనమున(బలంగా మునిపంటితో కొరకడంవల్ల) తొట్టవాతెర(కింది పెదవినుంచి) నెత్తురుట్టిపడగ' కోపం ముంచుకొచ్చే తీరును వర్ణించాడు. 'హడావుడి జీవితాలు, చిటికేస్తే పలికే కోపతాపాలు... వంటి ఎన్నో కారణాలవల్ల ప్రపంచం విచారంలో కూరుకుపోతోంది' అంటోంది అమెరికాకు చెందిన గాలప్ సంస్థ నివేదిక. గత రెండేళ్లుగా మనుషులు ఎన్నడూ లేనంత విచారంగా, కోపంగా ఉంటున్నారని 140 దేశాల సర్వేలో తేలింది. 'అలసులు, మందబుద్ధియుతులు, అల్పతరాయువులు, ఉగ్రరోగ సంకలితులు' అంటూ కలియుగ మానవులకు భాగవతం కొన్ని విశేషణాలను చేర్చింది. ఈ నివేదికను గమనిస్తే మరెన్నో దానికి జతపడేటట్లున్నాయి. కలి లక్షణమే అంత!

# సామాజిక న్యాయ రాజకీయం

## కీలకం కానున్న బీసీల వర్గీకరణ

మండల్ కమిషన్ సిఫార్సులు దేశ రాజకీయాలను కీలక మలుపుతిప్పాయి. వెనకబడిన వర్గాలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను కల్పించాలని మండల్ కమిషన్ సిఫార్సు చేయడం, దాన్ని అమలు చేయడానికి 1990లో వీపీ సింగ్ ప్రభుత్వం నడుంకట్టడం, ఆ సందర్భంలోనే భారతీయ జనతాపార్టీ రామజన్మభూమి నినాదాన్ని ఎత్తుకుని ఉద్యమించడం- దేశ చరిత్రను అసాధారణంగా ప్రభావితం చేశాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజకీయాలు, ముఖ్యంగా ఉత్తరాదిలో ఈ రెండు అంశాల చుట్టూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తిరుగుతున్నాయి. మండల్- మందిర్ ఆందోళనల నేపథ్యంలోనే వెనకబడిన వర్గాలకు వేదికగా ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లలో కొత్త పార్టీలు పుట్టుకొచ్చాయి. ఆ పార్టీల వల్లే కాంగ్రెస్ పార్టీ ఆ రెండు రాష్ట్రాల్లో కోలుకోలేని విధంగా కుంగిపోయింది. మండల్ సిఫార్సులను ఆలంబనగా చేసుకుని రాజకీయంగా ఎదిగిన పార్టీల నుంచే భాజపాకు ఒకప్పుడు గట్టి సవాళ్లు ఎదురయ్యాయి. సామాజిక న్యాయం నినాదంతో రాజకీయంగా ఎదిగిన పార్టీలు కాలక్రమంలో కుటుంబ పార్టీలుగా మారిపోయాయి. వెనకబడిన తరగతుల్లో కొన్నింటికే ప్రాబల్య కేంద్రాలుగా తయారయ్యాయి. ప్రస్తుతం మనముందున్న చరిత్ర ఇది. చరిత్ర పునరావృతం అవుతుందంటే మనం ఒక పట్టాన నమ్మలేం! ఒకసారి దిగిన నదిలో రెండోసారి దిగలేమని గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ ఎప్పుడో చెప్పారు. వెనకబడిన వర్గాల రిజర్వేషన్ల అంశం 30 ఏళ్లనాడు రాజకీయాలను ఏ మలుపు తిప్పిందో తిరిగి అలాంటి మలుపునే మళ్ళీ అదే అంశం తీసుకురానుందా, అది కొత్త రాజకీయపార్టీల పుట్టుకకు దారితీస్తుందా లేక ప్రస్తుతం ఉన్న పార్టీల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తుందా? ఏది జరిగినా చరిత్ర పునరావృతం అయినట్లే అనుకోవచ్చు!

### త్వరలోనే నివేదిక

వెనకబడిన వర్గాలకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అమలవుతున్న 27 శాతం రిజర్వేషన్లను వర్గీకరించడానికి జస్టిస్ రోహిణి సారథ్యంలో ఏర్పాటైన కమిషన్ తన నివేదికను త్వరలో కేంద్రానికి సమర్పించే అవకాశం ఉంది. కమిటీ ఇచ్చే వర్గీకరణ సిఫార్సులను కేంద్రం ఆమోదించడం దాదాపుగా ఖాయంగా కనబడుతోంది. ఆర్థికంగా ఎదిగి, వ్యవసాయరంగంపై పట్టు సాధించిన కొన్ని కులాలు ఉత్తర్ ప్రదేశ్, బిహార్‌లలో సమాజ్‌వాది, రాష్ట్రీయ జనతాదళ్ పార్టీలకు వెన్నుదన్నుగా ఉన్నాయి. వీటికి తోడు ముస్లిముల అండదండలూ చాలా సందర్భాల్లో ఈ పార్టీలవైపే ఉన్నాయి. ఈ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఆ కులాలకే అన్నింటా ప్రాధాన్యం లభించిందన్న విమర్శలను అంత తేలిగ్గా కొట్టేయలేం. ఇక ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అమలవుతున్న 27 శాతం రిజర్వేషన్లను ఎక్కువగా పొందింది యూపీ, బిహార్‌లలో ఈ పార్టీల వెంటనున్న కులాలే.

మండల్ సిఫార్సుల నేపథ్యంలో మందిర్ నినాదంతో బాగా బలపడిన భాజపాకూ వెనకబడిన వర్గాల్లో పెరిగిన రాజకీయ అధికార ఆకాంక్షను కాదనలేని పరిస్థితి ఏర్పడింది. ఉత్తరాదిలో 1996నాటికి ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో 25 శాతం వెనకబడిన వర్గాలవారున్నారు. 1984లో ఇది 11 శాతమే. మండల్ నేపథ్యంలో మొలకలెత్తిన రాజకీయ చైతన్యానికి ప్రతీకగానే దాన్ని సామాజిక శాస్త్రవేత్తలు భావించారు. భాజపాకూ ఈ చైతన్యం తాలూకు వేడి తాకింది. వెనకబడిన వర్గాల ప్రాతినిధ్యం ఆ పార్టీలో క్రమేపీ పెరిగింది. కల్యాణ్‌సింగ్ లాంటి బీసీ నేతను యూపీ ముఖ్యమంత్రిని చేయాల్సి వచ్చింది.

రాజకీయాలతో సంబంధం లేకుండా రిజర్వేషన్ల వర్గీకరణ అంశం ఎప్పటినుంచో నలుగుతూనే ఉంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో వర్గీకరణ చాలాకాలం నుంచే అమలులో ఉంది. దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో వర్గీకరణను అమలుచేస్తున్నారు. సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని ఉత్తరాది రాష్ట్రాల్లో వర్గీకరణను చేపట్టాలనే వాదన బలంగా వినిపించినా పెద్దగా పట్టించుకోలేదు. జస్టిస్ రోహిణి కమిషన్ ఏర్పాటుతో వర్గీకరణ వాస్తవ రూపం దాల్చబోతోంది. ప్రజాస్వామ్యంలో ప్రతిదానికీ రాజకీయ ప్రతిఫలం ఉంటుంది. వర్గీకరణ దీనికి మినహాయింపు కాదు. ఉత్తరాదిలో భాజపా తన బలాన్ని ఇంకా పెంచుకునే అవకాశం ఉంది. యూపీ, బిహార్‌లలో రాజకీయంగా ప్రాతినిధ్యంలేని కులాలపై గత పదేళ్ల నుంచి భాజపా బాగా దృష్టి సారించింది. 2014 తరవాత దీన్ని మరింత ఉధృతం చేసింది. ఎస్సీ ఎస్టీ కమిషన్ తరహాలో బీసీ కమిషన్‌కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగ సవరణను ముందుకు తీసుకువచ్చింది. పార్టీ టికెట్ల కేటాయింపులోనూ యాదవేతర కులాలపైనే దృష్టి పెట్టింది. అమిత్ షా సోషల్ ఇంజినీరింగ్ వ్యూహానికి యూపీ, బిహార్‌లే ప్రయోగశాలలయ్యాయి. ఈ పరిణామాలన్నీ ఉత్తరాదిన భాజపాకు యాదవేతర కులాల్లో గట్టి పట్టు దొరికేందుకు దోహదపడేవే. ఇంకా స్పష్టంగా చెప్పుకోవాలంటే మండల్ కమిషన్ సిఫార్సులను



బి.పి.మండల్



జస్టిస్ రోహిణి



విశ్వనాథ్ ప్రతాప్ సింగ్



నరేంద్ర మోదీ

ఆధారంగా చేసుకుని రాజకీయంగా బలపడిన పార్టీలకు ఆ రిజర్వేషన్లలో వర్గీకరణ చేపట్టి పెనుసవాలు విసరనుంది. దీనివల్ల ఆ పార్టీలకు రాజకీయ అస్తిత్వ సమస్య ఎదురయ్యే ప్రమాదమూ లేకపోలేదు.

ఇటీవల ఎన్నికల్లో అఖండ విజయం అనంతరం భాజపా చేపట్టబోయే అతి కీలకమైన సామాజిక అంశంగా వర్గీకరణనే చెప్పుకోవచ్చు. వర్గీకరణ కేంద్రస్థాయిలో అమలైతే అన్ని రాష్ట్రాల్లో దాన్ని అమలుచేయాల్సిన పరిస్థితి వస్తుంది. రాష్ట్రాల స్థాయిలో రాజకీయ పార్టీలకు మరోమార్గం ఉండకపోవచ్చు. ఇది అంతటితో ఆగుతుందనీ చెప్పలేం. ఎన్నాళ్లనుంచో షెడ్యూలు కులాల రిజర్వేషన్లలోనూ వర్గీకరణను చేపట్టాలన్న డిమాండు ఉంది. తెలుగు రాష్ట్రాల్లో 20 ఏళ్ల నుంచి ఇందుకోసం ఆందోళనలు నడుస్తూనే ఉన్నాయి. బీసీల్లో కొన్ని కులాలే రిజర్వేషన్ల ఫలాలను చేజిక్కించుకున్నాయన్న వాస్తవాన్ని గ్రహించి వర్గీకరణకు పూనుకొంటే ఎస్సీల్లో ఆ పరిస్థితిని ఎందుకు చక్కదిద్దరన్న ప్రశ్న తలెత్తక మానదు.

### ప్రతిపాదన పాతదే

నిజానికి 1953లో కలేల్కర్ నేతృత్వంలో ఏర్పాటైన తొలి బీసీ కమిషనే 1955 నాటి తన నివేదికలో వర్గీకరణను ప్రతిపాదించింది. వెనకబడిన, అత్యంత వెనకబడిన తరగతులుగా బీసీలను విభజించి రిజర్వేషన్లు ఇవ్వాలని చెప్పింది. 2,399 కులాలను వెనకబడిన కులాలుగా పరిగణించి, జనాభాలో వీరి సంఖ్య 32 శాతం ఉండొచ్చని అంచనా వేసింది. స్వాతంత్ర్యానంతరం కులాల జనాభాపై నిర్దిష్ట సమాచారం లేనందువల్ల 1931 జనాభా లెక్కల ఆధారంగా ఆ నిర్ధారణకు వచ్చింది. అయితే కలేల్కర్ సిఫార్సులను ఆనాటి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. ఎస్సీ, ఎస్టీలకు కాకుండా ఇతర కులాలకూ రిజర్వేషన్లు కల్పిస్తే సమాజంలో కుల విభజనలు పెరుగుతాయని, పంచవర్ష ప్రణాళికల ద్వారా జరిగే అభివృద్ధితో అందరికీ సమాన అవకాశాలు దక్కుతాయని భావించింది. మౌలికంగా ఈ ఆలోచన నెహ్రూది. దాన్ని కాంగ్రెస్‌లో ఎవరూ ప్రశ్నించే సాహసం చేయలేదు. కమ్యూనిస్టులూ ఆర్థికాభివృద్ధి జరిగితే అన్నీ సర్దుకుంటాయనే భావించేవారు. రామ్‌మనోహర్ లోహియా మాత్రం కులం ఆధారంగానే వెనకబాటుతనం ఉందని గట్టిగా వాదించి రిజర్వేషన్లు అవసరమని చెప్పేవారు. లోహియా శిష్యులే 1977లో జనతా ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించి బి.పి.మండల్ ఆధ్వర్యంలో వెనకబడిన కులాలకు రిజర్వేషన్ల కోసం కమిషన్‌ని ఏర్పాటు చేయించారు. 1979 జనవరి ఒకటిన మండల్ కమిషన్ ఏర్పాటైంది. అది 1980 డిసెంబర్ 31న నివేదికను ఇచ్చింది. మొత్తంగా 3,743 కులాలను వెనకబడిన కులాలుగా గుర్తించి 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సిఫార్సు చేసింది. జనాభాలో బీసీల సంఖ్య 52 శాతమని చెప్పింది. అందుబాటులో ఉన్న గణాంకాలను అధ్యయనం చేసి కేంద్ర ఉద్యోగాల్లో 12.55 శాతం మాత్రమే బీసీలు ఉన్నారని చెప్పింది. ఇక క్లాస్-1 ఉద్యోగాల్లో అయిదు శాతమే ఉన్నారనీ తెలిపింది. రిజర్వేషన్ల సౌకర్యం వల్ల ఎస్సీ, ఎస్టీలు బీసీల కంటే ఎక్కువగా ఉద్యోగాల్లో ఉన్నారని చెప్పింది. ఈ రెండు వర్గాలకు ఉద్యోగాల్లో ఆ నాటికి 18.72 శాతం ప్రాతినిధ్యం ఉంది. బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు అవసరమో పేర్కొంటూ మండల్ కమిషన్ ఇచ్చిన గణాంకాలను పరిగణనలోకి తీసుకునే 27 శాతం రిజర్వేషన్లకు సుప్రీంకోర్టు ఆమోదముద్ర వేసింది. వెనకబాటుతనానికి దేశంలో కులం ఆధారంగా ఉందన్న మండల్ కమిషన్ వాదనతో ఏకీభవించింది.

### అసలైన ఆసక్తికరాంశం

వర్గీకరణ అధ్యయనంలో భాగంగా జస్టిస్ రోహిణి కమిషన్ అయిదేళ్లలో ఓబీసీ కోటా కింద భర్తీ అయిన ఉద్యోగాలను పరిశీలించింది. మూడేళ్ల కాలంలో విద్యాసంస్థల్లో ప్రవేశాలనూ విశ్లేషించింది. సంఖ్యాపరంగా 25 శాతం లోపున్న కులాలు 97శాతం 'ఉద్యోగాలు/ ప్రవేశాలు' దక్కించుకున్నాయి. ఇంకా సూక్ష్మంగా వెళ్ళి పరిశీలిస్తే 10 కులాలు 24.95 శాతం 'ఉద్యోగాలు/ ప్రవేశాలు' పొందాయి. 983 కులాలు ఏ ఫలితాన్నీ పొందలేదు. 994 కులాలకు 2.8 శాతం ప్రాతినిధ్యమే లభించింది. 2015 మార్చి 31నాటికి కేంద్ర ఓబీసీ జాబితాలో 2,418 కులాలు ఉన్నాయి. ఈ సంఖ్య ప్రస్తుతానికి 2,633కు చేరింది. అంటే దాదాపు రెండువేల కులాలకు దక్కిన ప్రాతినిధ్యం ఎంత నామమాత్రమో ఈ లెక్కల్నిబట్టే అర్థమవుతుంది. రిజర్వేషన్ల ఫలితాలను అందుకోవడంలో నెలకొన్న ఇంతటి అసమానత్వాన్ని ఎలా తొలగించబోతున్నారన్నదే ఇప్పుడున్న ప్రశ్న. ఇప్పటిదాకా ఎటువంటి లబ్ధి పొందని కులాలు, ఎంతో కొంత లబ్ధి పొందినవి, గరిష్ఠంగా లబ్ధి పొందినవిగా విభాగించి వర్గీకరణ శాతాలను ప్రతిపాదించే అవకాశం ఉంది. రిజర్వేషన్ల ఫలాలు అందరికీ అందేలా చూడటం లక్ష్యం కాబట్టి ఇప్పటివరకూ గరిష్ఠంగా లబ్ధి పొందిన కులాలకు కోతపడటం ఖాయం. జస్టిస్ ఈశ్వరయ్య నేతృత్వంలోని బీసీ కమిషన్ ఏ, బీ, సీలుగా వెనకబడిన వర్గాలను వర్గీకరించాలని అభిప్రాయపడింది. ఆర్థిక స్థితిగతులు, సామాజిక స్థితిని దృష్టిలో ఉంచుకొని ఆ వర్గీకరణను సూచించింది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్గీకరణకు రాజకీయ వ్యతిరేకత పెద్దగా రాకపోవచ్చు. న్యాయపరీక్షకూ వర్గీకరణ నిలబడే అవకాశం ఉంది. రాజకీయ రంగంలో ఎత్తులకు పైఎత్తులకు ఏ అంశం ఎప్పుడు ఎలా ఉపయోగపడుతుందో లెక్కల్లాగా కచ్చితత్వంతో చెప్పలేం. రిజర్వేషన్లను మాత్రం దీనికి కొంత మినహాయింపుగానే చెప్పుకోవాలి. అనూహ్యరీతిలో ఆర్థికంగా పేదవర్గాలకు 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకువచ్చిన రాజ్యాంగ సవరణ కారణంగా ఇటీవలి ఎన్నికల్లో భాజపాకు ఉత్తరాదిన లాభం చేకూరలేదనగలమా!

– ఎస్.రాహుల్ కుమార్


# అవినీతి అడుసులో జుగల్బందీ

'స్వరాజ్యం నా జన్మహక్కు' అని నినదించిన లోకమాన్య తిలక్- తెల్లదొరతనం శృంఖలాలు తెగిపడి స్వాతంత్ర్యం సిద్ధిస్తే సురాజ్య సంస్థాపనకు బాటలుపడతాయని బలంగా విశ్వసించారు. దేశానికి స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు దాటిపోయినా, దోపిడీ పీడనలకు తావులేని సురాజ్యం కోసం నూటముప్పై కోట్ల మందికిపైగా భారతీయులు చకోరాలై ఎదురుచూడాల్సి వస్తోందిప్పుడు! తన ఆశీస్సుల కోసం వచ్చిన బెంగాల్ మంత్రులకు- 'సేవాపరాయణులై నిజాయతీగా పౌరులపట్ల ధర్మం నిర్వర్తించడమే మీ కర్తవ్య'మని ఏడు దశాబ్దాల క్రితం మహాత్మాగాంధీ దిశానిర్దేశం చేశారు. జాతిపిత మాటకు ఏపాటి మన్నన దక్కుతుందో పశ్చిమ్‌బంగ పరిణామాలే తాజా రుజువులవుతున్నాయి. రాజకీయ నాయకులు, అధికారుల మధ్య బిగిసిన అక్రమ బాంధవ్యం- 'కట్‌మనీ' దురాగతంగా వ్యవస్థీకృతమైన వైనం నిశ్చేష్టపరుస్తోంది. ఆ విధంబెట్టిదనిన...

ప్రభుత్వోద్యోగి ఎవరైనా లంచాలు మరిగి అక్రమ సంపాదనకు తెగబడటం చట్టరీత్యా నేరం. అధికార వర్గాల ఇష్టారాజ్యాన్ని అదుపు చేసి సంక్షేమ పథకాల తాలూకు ప్రయోజనాల్ని అసలైన లబ్ధిదారులకు సక్రమంగా అందించేందుకు చొరవ చూపడం ప్రజాప్రతినిధుల విహిత కర్తవ్యం. ఈ రాజకీయ నేతలు, ఆ అధికార శ్రేణులు 'నీకిది నాకది' చందంగా అవినీతి అడుసులో ఈదులాడుతూ లబ్ధిదారుల నోటి దగ్గర ముద్దను గద్దల్లా లాగేసుకొంటుంటే- దాన్నేమనాలి? ఆ చీకటి వ్యవహారానికి ముద్దుపేరే 'కట్‌మనీ'! పేద ప్రజల జీవన ప్రమాణాల్ని, పోషకాహార స్థాయిల్ని మెరుగుపరచడం ప్రభుత్వాల బాధ్యత అని రాజ్యాంగంలోని 47వ అధికరణ స్పష్టీకరించింది. కూడు, గూడు, గుడ్డ వంటి కనీసావసరాలకూ నోచని కోట్లాది బడుగు జీవులతో లుకలుకలాడే భాగ్యాన్ని భారతావనికి కల్పించిన ఏడు దశాబ్దాల రాక్షస గణతంత్ర పాలన మనది. మాకిది కావాలని నోరెత్తి అడగలేకపోతేనేం- బడుగు జనం మాపుడు వేళ్లపై సిరా చుక్కకు నేతల తలరాతల్ని తిరగరాసే అమేయశక్తి ఉంది. అందుకే కేంద్ర స్థాయిలోను, రాష్ట్రాలవరంగానూ ఏటా కొన్ని లక్షల కోట్ల రూపాయల విలువైన సంక్షేమ పథకాల హోరు మిన్నంటుతుంది. ఆయా పథకాల లబ్ధిదారుల జాబితాలో అర్హులుగా వాళ్లను చేర్చాలన్నా, ఇళ్లనో, తోపుడు బళ్లనో కేటాయించాలన్నా పాతిక శాతం కమిషన్ కక్కితీరాలంటోంది కట్‌మనీ! ఆ దారుణాన్ని మరే మాత్రం సహించేది లేదన్న మమతా దీదీ హెచ్చరిక పశ్చిమ్ బంగలో రాజకీయ ప్రకంపనల్ని సృష్టిస్తోంది.

పార్టీ శ్రేణుల భేటీలో పది రోజుల క్రితం మమత అక్షరాలా బాంబు పేల్చారు. మొన్నటి ఎన్నికల్లో ఎకాయెకి 18 సీట్లను భాజపాకు కోల్పోవడం, జూనియర్ వైద్యుల సమ్మెతో తల తిరిగి ముద్ద నోట్లోకి రావడంతో- తన పట్టు నుంచి రాష్ట్రం చేజారకుండా కాచుకొనేందుకు, పాలక పక్షీయులకు ఏ మాత్రం రుచించని వ్యాఖ్యలు చేశారు. 'లబ్ధిదారుల నుంచి కమిషన్లు తీసుకొని ఉంటే తిరిగి ఇచ్చేయండి... నేను చర్యలు తీసుకోవడం మొదలుపెడితే మీరు పార్టీ మారక తప్పదు' అని దీదీ గర్జించారు. ఇప్పటికే తృణమూల్‌ను వదిలి భాజపా తీర్థం పుచ్చుకొన్న నేతల్ని అవినీతిపరులుగా తూలనాడిన మమత అక్షరాలా అధికార పార్టీ నేతలకు ముందు నుయ్యి- వెనక గొయ్యి లాంటి పరీక్ష పెట్టారు. అంతకుమించి 'కట్‌మనీ' నేరాల్ని భారత శిక్షాస్మృతిలోని 409 విభాగం కింద విచారించి దోషులకు జీవితఖైదు లేదా పదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించాలనీ ప్రతిపాదించారు. ఎందుకొచ్చిన గొడవ అనుకున్నాడో ఏమో- బీర్‌భూమ్ జిల్లాకు చెందిన ఓ చిన్న స్థాయి 'పెద్ద మనిషి', ఉపాధిహామీ పథకం కింద లబ్ధి చేకూరుస్తానంటూ వసూలు చేసిన మొత్తాన్ని 141 మందికి తిరిగి ఇచ్చేశాడు. ఇంకేముంది? తమకు రావాల్సిన మొత్తంలో పాతిక శాతం మొత్తాన్ని 'కట్‌మనీ'గా సమర్పించుకొన్న చిరు లబ్ధిదారులంతా ఎక్కడికక్కడ నేతాగణాల్ని నిలదీయడం మొదలుపెట్టారు. పార్టీ పేర్లు లేకుండా పలుచోట్ల ప్రజల పక్షాన వెలుస్తున్న పోస్టర్లు ప్రజాప్రతినిధులకు కంటి మీద కునుకు రానీయడం లేదు. కంటికి కనిపించే వసూల్ రాజా ఒక్కడే అయినా, తెరచాటు అవినీతి బంతిలో ఎవరికి వారుగా తమ వాటా మెక్కిన వాళ్ల చిట్టా చాలా పెద్దదని, అదే గొలుసుకట్టు వరసలో డబ్బులు తిరిగి వస్తేనే స్థానిక నేతలు తిరిగి చెల్లించడం వీలవుతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. దీన్నిబట్టి అర్థమవుతున్నదేమిటి? అవినీతి అష్టపాది ఏటికేడు మరింత బలిష్ఠంగా ఎదిగి మొత్తం వ్యవస్థనే గుల్లబార్చేస్తోంది.





'కట్‌మనీ' కోసం పశ్చిమ్ బంగలోని గ్రామీణుల ఆందోళన
అంతరచిత్రం: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

అన్ని రకాల అవినీతికీ తల్లివేరు రాజకీయ అవినీతి. రాజకీయాల్లో మునిగి తేలుతున్నవారు నీతి నిజాయతీ నిరూపించుకోవాలంటూ ఎదిరి పక్షాన్ని నిగ్గదీయవచ్చు గాని, ఆ నిప్పుతో తమ కొప్పు కాల్చుకోవడం తగదన్నది నయా రాజనీతి. తానే పెట్టిన అగ్ని పరీక్ష తృణమూల్ కాంగ్రెస్ నేతాగణాల్ని కకావికలం చేస్తోందని తెలియగానే మమత మాట మార్చారు. 99.99 శాతం పార్టీ నేతలు నీతిమంతులేనని తేల్చేశారు. 'కట్‌మనీ' సొమ్ముకోసం గ్రామాల్లో ప్రజాందోళనలు పెరుగుతున్నాయన్న పోలీసు వర్గాల హెచ్చరికల నేపథ్యంలో- తనవంతుగా ఉద్రిక్తతల్ని తగ్గించేందుకు మమత నానాపాట్లు పడుతున్నారు. ఈ 'కట్‌మనీ' జాడ్యం ఒక్క బెంగాల్‌కే పరిమితమా? 'నీకిది- నాకది' అంటూ ప్రజాప్రతినిధులు, అధికార గణాల జుగల్బందీ- దేశ ప్రజానీకాన్ని ఎంతగా దోచుకుతింటోందో లెక్కాపత్రం ఏదైనా ఉందా? 1980-2010 మధ్యకాలంలో భారతీయులు విదేశాలకు తరలించిన నల్లధనం 15,12,000- 34,30,000 కోట్ల రూపాయల దాకా ఉండి ఉంటుందని పార్లమెంటరీ స్థాయీసంఘం మొన్నీమధ్య నిగ్గుతేల్చింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ నిరుడు అక్టోబరులో వెల్లడించిన అధ్యయనాంశాల ప్రకారం అవినీతి విక్రమంలో ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, తమిళనాడు వరసగా తొలి మూడు స్థానాలు ఆక్రమించాయి. ప్రభుత్వాల నుంచి తమకు రావాల్సిన లబ్ధిని పొందాలంటే లంచం ఇవ్వకతప్పని పరిస్థితి ఒక తీరు. ప్రభుత్వంలోని పెద్దల నుంచి తమకు చెరుపు జరగకుండా చూసుకోవడానికీ అమ్యామ్యాలు ముట్టజెప్పక తప్పని దుస్థితి- మన సంక్షేమ రాజ్యం మూలగనే పీల్చేస్తోంది. పశ్చిమ్ బంగలో నీతి అనే కొరివితో తలగోక్కున్న మమతా దీదీ పితలాటకాన్ని పక్కన పెడితే, 'కట్‌మనీ' పైశాచాన్ని కక్కించేందుకు బెంగాలీ సోదరులు ముందుకు ఉరికిన వైనం నుంచి మనం గుణపాఠాలు నేర్వలేమా? రవీంద్రనాథ్ ఠాగూర్ చెప్పినట్లు- జాతి నైతిక దిక్సూచిని సరిచేసుకోవాల్సిన బాధ్యత ఈ దేశ పౌరులుగా మనమీద లేదా!

– పర్వతం మూర్తి

పుణ్యభూమి

## విజయ సూత్రాలు

దేవుడు మనిషిని సృష్టించి అతడి చేతికి అప్పగించిన అత్యద్భుత ధనం- జీవితకాలం. దురదృష్టవశాత్తు మానవుడు అతి సులువుగా దుర్వినియోగం చేసే ధనం కూడా అదే. కోటి ఖర్చు పెట్టినా అర క్షణాన్ని కొనలేమన్న సత్యం తెలిసీ పట్టించుకోం. నిజంగా అది తప్పిదమే. లక్ష్య సాధకుడైన మనిషి, మొదట గుర్తించాల్సింది- సమయం విలువ.

జాగ్రత్తపరుడిపై అందరికీ నమ్మకం ఉంటుంది. అందుచేత అతడికే అధికారులు బాధ్యతల్ని అప్పగిస్తారు. వాటిని ఆ వ్యక్తి బరువుగా భావించకూడదు. బాధ్యతారాహిత్యం ప్రతిభను వెలుగులోకి రానివ్వదు.

తనపై పడిన పని భారాన్ని నిందించకూడదు. అది దైవదత్తంగా భావించాలి. ఎంతోమంది ఉన్న సమాజమిది. ఎవ్వరికీ లేనంత అవిశ్రాంతమైన ఒత్తిడిఉన్నా సృష్టికర్తకు మనపై నమ్మకం ఎక్కువన్న సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండాలి. సరస్సు దాటి బయటకు రాలేని తాబేలు సైతం నీటిపై నాచును భుజిస్తుంది. నీరు నిర్మలంగా ఉండటానికి దోహదపడుతుంది. మనిషి అమితంగా భయపడే సర్పం కూడా పంట నాశనానికి హేతువయ్యే ఎలుకల పని పడుతుంది. ఆయా ప్రాణులకు భగవంతుడు అప్పగించిన బాధ్యతలవి.

విజేతగా నిలవాలనుకున్న వ్యక్తి సమాజంతో సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలి. సొంతలాభం కొంత మానుకొని పొరుగువారికి తోడ్పడమన్న మాట పాటిస్తే అది మనిషిని చిర యశస్కుడిగా నిలబెడుతుంది.

గెలుపు పిలుపు వినాలనుకునే వ్యక్తి మిగతా వారికన్నా ఎక్కువగా మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండాలి. విజయం ఒక్క అడుగుదూరంలో ఉన్నా మానసిక దౌర్బల్యం ఓటమిని రుచి చూపిస్తుంది.

ధనుర్విద్యలో అర్జునుడు ప్రపంచంలోనే మేటి. అతడు మానసిక దుర్బలత్వం ఆవహించి యుద్ధవిముఖుడు కావడం సర్వ విదితమే. గీతా శ్రవణం అతడి వేదన తొలగించింది. విజయుణ్ని చేసింది. ఆధ్యాత్మిక భావనలు మనసు దృఢంగా మారడానికి కారణం అవుతాయన్న సంగతి ఈ సంఘటన ద్వారా స్పష్టమవుతుంది. జాతిపిత గాంధీ మహాత్ముడు సైతం బ్రిటిష్ పాలన అంతం కాదేమో అన్న నిస్పృహ కలవరపెట్టినప్పుడు భగవద్గీత చదివేవారు. తద్వారా వెయ్యి ఏనుగుల బలం తనకు లభించేదనేవారాయన.



అంతర్యామి

భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఎవరికీ తెలియదు. రేపు బాగుండాలనే అందరం కలలు కంటాం. ఈ కలలు మనిషి నిద్రావస్థలో పొందే స్వప్నాలకు భిన్నం. నరనరాల్లో లక్ష్యం ప్రవహించే వ్యక్తి పనిచేస్తూ కూడా కలలు కంటాడు. గమ్యం చేరుకున్న తరవాత ఏ విధంగా తనను ప్రపంచం భుజానికెత్తుకుంటుందో ముందే చూడగలుగుతాడు. ఆ ఆలోచనలు అతడిలో ఉత్తేజాన్ని రేకెత్తిస్తాయి.

మనిషి తన శ్రమను నిందించుకుంటూ, నిట్టూరుస్తూ ప్రయత్నం చెయ్యకూడదు. మనం చేరుకునే లక్ష్యం స్వర్గమని భావిస్తే దానికోసం వేసే ప్రతి అడుగునూ మధురానుభూతిగా నిలుపుకోవాలి. శ్రీరాముడి హృదయంలో ఈ చైతన్యం నిండుగా కనిపిస్తుంది. సీతాదేవితో కలిసి ఆ మహనీయుడు కీకారణ్యంలో నివసించాడు. వన సౌందర్యాన్ని దర్శించుకుంటూ ఆ ఇద్దరూ ప్రతిక్షణాన్ని ఆస్వాదించారు. రాజభోగాలు దూరమయ్యాయన్న స్పృహ వారిలో ఏ సందర్భంలోనూ కనిపించదు.

గమ్య సాధనలో ఎవరినైనా ముందు పలకరించేవి అపజయాలే. విజయాన్ని చిరునామాగా మార్చుకోవాలనుకుంటే ఓటమిని చూసి కుంగిపోకూడదు. కొండమీద నుంచి నేలపైకి దూకుతుంది జలపాతం. నీరు రాళ్ల మధ్య నుంచి, ముళ్ల మధ్యనుంచి దారిచేసుకుని ప్రవహిస్తుంది. పడిపోయినంత మాత్రాన ఆ నీటిది ఓటమి కాదు. తన గమ్యం బీడువారిన నేలను సస్యశ్యామలం చేయటం. అది అన్నింటికన్నా గొప్ప విజయం. ఇదే తత్వం విజయవాంఛితుడిలో కనిపించాలి. అటువంటివారికి విజయం తథ్యం. ఆ విజయానికే సార్థకతా లభిస్తుంది!

– జి.రామచంద్రరావు

# హాయ్

కరీంనగర్, ఆదివారం జూన్ 30, 2019

ప్రేక్షకుడు వెండితెరపై ఒక హీరోని కాకుండా తనని తాను చూసుకుంటాడు. 'నీదీ నాదీ ఒకే కథ' అంటూ ఆ పాత్రలో లీనమైపోతాడు. చివరిగా నాలోనూ ఓ హీరో ఉన్నాడనుకుంటూ థియేటర్ నుంచి బయటికొస్తాడు. శ్రీవిష్ణు చేసే సినిమాలన్నీ అలాగే ఉంటాయి. వాస్తవానికి ప్రతిబింబంలా... సగటు జీవితాల్ని కళ్లకు కట్టేలా ఉంటాయి ఆయన ఎంచుకొనే కథలు. అందుకే కథానాయకుల్లో శ్రీవిష్ణుకి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన సినిమా అంటే కొత్తదనం ఉంటుందనే ఓ నమ్మకం ప్రేక్షకుల్లో కనిపిస్తుంటుంది. క్రికెట్ నుంచి సినిమావైపు ఎలా వచ్చారు? ఆయన ప్రేమకథ ఏమిటి? కథల ఎంపికలో ఆయన ఆలోచనలు ఎలా ఉంటాయి? తదితర విషయాల్ని 'హాయ్'తో పంచుకొన్నారు శ్రీవిష్ణు.



**✦ మీరు సినిమాల్లోకి ఎలా వచ్చారు?**

నాకు సినిమా అంటే పిచ్చి ఉండేది. అంతర్వేదిపాలెం మా సొంతూరు. ఆ తర్వాత భీమవరం వచ్చాం. భీమవరం, అమలాపురంలో నా పాఠశాల చదువు పూర్తయింది. విజయవాడలో ఇంటర్, విశాఖపట్నంలో డిగ్రీ చేశా. ఎక్కడికి వెళ్లినా సినిమాల్ని మాత్రం వదిలిపెట్టలేదు. చూసిన సినిమానే అయినా మళ్లీ మళ్లీ చూసేవాణ్ని. విశాఖపట్నం గీతంలో బీబీఎమ్ పూర్తి చేశాక, వెంటనే ఉద్యోగం వచ్చింది. మేనేజ్‌మెంట్ రంగంలో మంచి ఉద్యోగం, మంచి జీతం. పని కూడా బాగా చేస్తాననే పేరొచ్చింది. నాకు మాత్రం ఎవరికోసం, ఎందుకోసం ఈ పని అనిపించేది. 'నీదీ నాదీ ఒకే కథ'లో చెప్పినట్టుగా మనస్ఫూర్తిగా చేయనప్పుడు దాన్ని చేయకపోవడమే ఉత్తమం. తర్వాత ఏం చేయాలో స్పష్టత లేదు. కానీ సినిమా అంటే ఇష్టం కాబట్టి అందులోనే ఏదో ఒకటి చేయాలనుకొన్నా. చిన్నప్పట్నుంచి కథలు రాసుకోవడం ఓ అలవాటుగా ఉండేది. దాంతో ఉద్యోగం వదిలిపెట్టాక రెండు నెలలకి దర్శకుడు కావాలని నిర్ణయించుకున్నా. ఆ ఉద్దేశంతోనే పరిశ్రమలోకి అడుగుపెట్టా.

## సినిమా నాకు వరల్డ్‌కప్ లాంటిదే

**✦ సినిమాల్లోకి రాకముందు మీరు క్రికెట్ ఆడేవారట కదా?**

భారతదేశంలో కుర్రాళ్లకి సచిన్‌లా క్రికెటర్ కావాలనే ఓ కోరిక ఉంటుంది. చిన్నప్పుడు నేనూ అంతే. క్రికెట్‌లో ఆంధ్ర జట్టు తరపున ఆడాను. క్రికెట్ అయితే ఆడుతున్నాను కానీ... ఎలా ముందుకు వెళ్లాలో తెలియలేదు. అందుకే క్రికెట్‌ని ఆడుతూ కాకుండా, చూసి ఆస్వాదిద్దామనే నిర్ణయానికొచ్చా.

**✦ ఆ వయసు కథలు చేస్తా**

నవతరం కథానాయకులు చేసే కథలు దాదాపు 22 నుంచి 30 యేళ్ల వయసుకు సంబంధించినవే. కానీ ఏ మగాడు ఆ వయసులో హీరో అయిపోడు, హీరోలా ఫీలవుతాడంతే. సినిమా కాబట్టి, అబ్బ ఏం చేశాడ్రా అని ప్రేక్షకులు అనుకోవాలి కాబట్టి వాళ్లని హీరోలుగా చూపిస్తారంతే. నిజ జీవితంలో 30 నుంచి 50 యేళ్ల వయసులోనే రియల్ మేన్, రియల్ హీరోలు కనిపిస్తుంటారు. ఆ వయసు కథలు మన దగ్గర తెరకెక్కవెందుకో! నేను మాత్రం ఆ వయసు కథలపైనే దృష్టి పెడతా.

**✦ మరి కథానాయకుడు ఎలా అయ్యారు?**

అప్పటికే క్రికెట్, ఉద్యోగం వదిలిపెట్టా. ఇక సినిమా తప్ప నాకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఎలాగైనా ఇక్కడే సక్సెస్ కావాలి. సినిమా నాకు చాలా ముఖ్యమైన మ్యాచే కాదు, వరల్డ్‌కప్ కూడా. దాంతో జాగ్రత్తగా అడుగులు వేయాలని నిర్ణయించుకొన్నా. కానీ ఆరంభంలోనే కథానాయకుడిగా అవకాశాలొచ్చాయి. నేనేమో అప్పటికి నటించడానికి అస్సలు సిద్ధం కాలేదు. అందుకే మొదట నేర్చుకోవాలనే ఉద్దేశంతో ఆ అవకాశాల్ని ఒప్పుకోలేదు. పనిగట్టుకొని చిన్న పాత్రలవైపు దృష్టిపెట్టా. చిన్న పాత్రలే అయినా... పొద్దున్నుంచి సాయంత్రం వరకు షూటింగ్‌లోనే ఉండేవాణ్ని. అన్నీ గమనిస్తూ నాలెడ్జ్ పెంచుకొనేవాణ్ని. ఇక నటన పూర్తిగా పక్కనపెట్టేసి దర్శకుడు అవుదామనుకొనేలోగా మళ్లీ కథానాయకుడిగా అవకాశాలొచ్చాయి. అయితే ఇప్పటికీ ప్రతి సినిమాకీ నేనొక సహాయ దర్శకుడిగానే పనిచేస్తుంటా.

**✦ ఉద్యోగం వదిలేసి సినిమా అన్నప్పుడు ఇంట్లోవాళ్లు అభ్యంతరం చెప్పలేదా?**

నేను ఏదడిగితే అది కాదనకుండా ఇచ్చారు మా అమ్మానాన్నలు. వాళ్లు ఎప్పట్లాగే సినిమాల్లోకి వెళతానన్నా అభ్యంతరం చెప్పలేదు. కానీ నేను ఈ నిర్ణయం తీసుకొనేటప్పటికే నాకు పెళ్లయింది. అయితే నా భార్య కూడా అడ్డు చెప్పలేదు. ఆ విషయంలో నేను చాలా అదృష్టవంతుడిని. ఏం చేసినా కరెక్ట్‌గానే చేస్తాడనీ, ఏదీ అంత సులభంగా చేయడనేది తన నమ్మకం. ఎవరేమనుకొన్నా మనకు కావల్సిన బలాన్ని మాత్రం మన కుటుంబమే ఇస్తుంటుంది.

**✦ నా కూతురు పేరు మ్రిద**

నాది ప్రేమ వివాహం. నా భార్య పేరు ప్రశాంతి. డిగ్రీలో మేమిద్దరం క్లాస్‌మేట్స్. మూడేళ్లపాటు మా ప్రేమాయణం సాగింది. డిగ్రీ అవ్వగానే పెళ్లి చేసుకున్నాం. ముందు నేనే తనని ప్రపోజ్ చేశా. మాకొక పాప. తన పేరు మ్రిద. ఇప్పుడు ఎల్‌కేజీ చదువుతోంది. తన పేరు నేనే పెట్టా. విష్ణు అని నాకు దేవుడి పేరు పెట్టారు. స్కూల్‌లో అల్లరి చేస్తున్నప్పుడు టీచర్లు 'రేయ్ విష్ణూ.. ఏంట్రా ఆ చెత్త పనులు' అని అరిచేవాళ్లు. ఆ సమయంలో నాకు దేవుడి పేరు ఎందుకు పెట్టారో అనిపించేది. అందుకే వచ్చే తరాలకి కొత్తగా ఉండాలని మా పాపకి మ్రిద అని నామకరణం చేశా. తీరా ఆ పేరు పెట్టాక దాని అర్థం ఈశ్వరుడు అని తెలిసింది (నవ్వుతూ).

**✦ క్రికెట్‌లో అయితే సచిన్, మరి సినిమాల్లో మీకు స్ఫూర్తి ఎవరు?**

సచిన్ ఆరాధ్య క్రికెటరే కానీ... వ్యక్తిగతంగా బాగా ఇష్టమైన ఆటగాడు రాహుల్ ద్రవిడ్. సినిమాల్లో అయితే వెంకటేష్ నాకు స్ఫూర్తి. చిరంజీవి సినిమాల్ని బాగా చూసేవాణ్ని. రాహుల్ ద్రవిడ్, వెంకటేష్‌ల గురించి మాత్రం ఆసక్తిగా తెలుసుకొనేవాణ్ని. వాళ్ల వ్యక్తిత్వాన్ని అనుసరించేవాణ్ని.

- నర్సిమ్ ఎర్రకోట
ఫొటో: మధు



# అంబానీ ఆదర్శంగా...

**చదివింది కామర్స్.... చేస్తున్నది ఇంజినీరింగ్ అద్భుతాలు... వయసు 50 దాటకుండానే.... దాదాపు 30 వేల కోట్ల సామ్రాజ్యాన్ని సృష్టించి... నత్తనడకన నడిచే ప్రాజెక్టుల్లో కొత్తవేగం నింపి... నింపాదిగా మీ పక్కనే రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లినా తెలియని తెలుగు వాణిజ్య దిగ్గజం పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి... అయినా గుర్తుపట్టరు కదూ.... గోదారిని పట్టిసీమలు దాటించి... కాళేశ్వరాలు సృష్టించిన మేఘ ఇంజినీరింగ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి! ఈరోజే 50వ పడిలో అడుగుపెడుతున్న ఆయన అంతరంగ ఆవిష్కరణ ఈనాడు 'హాయ్' పాఠకులకు ప్రత్యేకం.**



**● వేల కోట్ల రూపాయల కంపెనీకి మీరు అధిపతి... ఎక్కడా పెద్దగా వినిపించరు. కన్పించరెందుకని?**

నా ఫొటోలు, పబ్లిసిటీతో కంపెనీకి ఏం లాభముందీ? సామర్థ్యం, పనితీరే పనికొస్తాయి. అందుకే వాటిపైనే ఎక్కువ దృష్టి. పేరు రావల్సింది సంస్థకుగాని నాకు వ్యక్తిగతంగా కాదు. పదిమందికి తెలవకపోవటం వల్ల హాయిగా ఎటంటే అటు వెళ్లగలుగుతాం కూడా!

**● కాళేశ్వరం, పట్టిసీమలతో మీ సంస్థ బాగానే పేరు సంపాదించింది కదా!**

వందల సంవత్సరాల కిందట కట్టినవే ఇప్పటికీ మనకళ్ల ముందు కనిపిస్తున్నాయి. అలాంటిది... అత్యద్భుత సాంకేతికత అందుబాటులో ఉన్న ఈ తరంలో ఇప్పుడు మేం కట్టేవి వేల సంవత్సరాలు నిలబడాలన్నది మా తపన. పనులన్నీ సకాలంలో, నాణ్యంగా పూర్తి చేసి తరతరాలు నిలిచేలా చేయాలన్నది ఉద్దేశం. సంస్థలో ప్రస్తుతం 14వేల మంది ప్రత్యక్షంగా పనిచేస్తున్నారు. పరోక్షంగా 5 లక్షల మంది.

**● ప్రాజెక్టులను సకాలంలో ఎలా చేయగలుగుతున్నారు?**

టీం వర్క్ వల్లే ఇది సాధ్యం. ప్రాజెక్టు తీసుకునేముందే అన్ని విధాలా ఆలోచిస్తాం. ఒక్కసారి ఓకే అనుకున్నాక ఇక ప్రతి ఒక్కరం ఇది మా ఇంటిపని అన్నట్లే పనిచేస్తాం. సొంత ఇల్లు కట్టుకుంటే ఎంత జాగ్రత్త పడతామో అలాగే ప్రతి ప్రాజెక్టునూ చేస్తాం. ఇది కొన్ని వందల సంవత్సరాల పాటు నిలబడాలనే ఉద్దేశంతో పనిచేస్తాం. అందుకే సబ్‌కాంట్రాక్టులు ఇవ్వం. ప్రతి చిన్నపనిని మేమే నాణ్యతతో పూర్తి చేస్తాం.

**● ఇంతమందిలో ఉమ్మడి లక్ష్యాన్ని ఎలా నిలబెడతారు?**

సంస్థపై ఉండే ఇష్టం. ప్రేమ, బాధ్యత వారిని నిరంతరం అలా పని చేయిస్తుంటాయి. మా సంస్థలో ఉద్యోగి, యజమాని అనే భేదాలుండవు. ఈ సంస్థ మా అందరిదీ అని ప్రతి ఒక్కరం అనుక్షణం భావిస్తాం.

**● ఈ సంస్థను ఆరంభించాలన్న ఆలోచన ఎలా వచ్చింది?**

నిజానికి నేను పదో తరగతి చదివేటప్పుడే చేస్తే జీవితంలో వ్యాపారం చేయాలి లేదంటే వ్యవసాయం చేసుకోవాలని అనుకున్నా. దినపత్రికలు, పుస్తకాలు చదవటం చిన్నప్పటి నుంచీ బాగా అలవాటు. 8, 9 తరగతుల్లోనే ధీరూభాయ్ అంబానీ కథ చదివాక ఉద్యోగం చేయకుండా వ్యాపారం చేయాలనే తపన బలంగా నాటుకుంది. మనమూ సక్సెస్ అవుతామో లేదో చూద్దామనుకుని డిగ్రీ కాగానే లక్ష రూపాయలతో వ్యాపారం మొదలెట్టాం.

**● మరి చదువుపై దృష్టి పెట్టలేదా?**

విజయవాడ దగ్గర డోకిపర్రు అనే గ్రామం మాది. ఎన్టీఆర్‌గారి నిమ్మకూరు పక్కనే ఉంటుందది. ఏడో తరగతి దాకా అక్కడే చదువుకున్నా. బాగా అల్లరి చేస్తున్నానని నన్ను హైదరాబాద్ పంపించారు. ఇక్కడే పికెట్ దగ్గర స్కూల్లో పదో తరగతి అయ్యాక ఇంటర్ నాగార్జున కాలేజీలో, డిగ్రీ ఉస్మానియా నుంచి చేశా. నిజానికి ఇంటర్‌కాగానే ఇంజినీరింగ్ చేద్దామనుకున్నా. చెప్పానుగా...వ్యాపారం చేయాలనుకున్నా కాబట్టి నాలుగేళ్ల ఇంజినీరింగ్ కంటే మూడేళ్ల డిగ్రీ చాలనుకొని బీకాంలో చేరా. 1990లో నా డిగ్రీ పూర్తికాగానే.... బాలానగర్‌లో ఇప్పుడు మేం ఉంటున్న చోటే మూడు షెడ్లు ఉండేవి. వాటిలో ఒకదాంట్లో ఫ్యాబ్రిక్ ఇంజినీరింగ్, పైప్‌లైన్ పనులు మొదలెట్టాం. అప్పటి నుంచీ సంస్థ మనందరిదీ అనేదే మా పద్ధతి. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. 27 సంవత్సరాలుగా మా సంస్థ ఈ స్థలంలోనే ఉంటుంది.

**● చదివింది కామర్స్.... ఇంత పెద్ద ఇంజినీరింగ్, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులెలా...?**

వ్యాపారం చేయటానికి హ్యూమన్ సైకాలజీ బాగా ప్రధానం. ప్రతి ప్రాజెక్టు అవకాశాలేంటి? అవసరాలేంటి? దాని ఫలితమేంటి? అనేవి ముందుగా నిశితంగా చూస్తాం. మాకు చాలా పెద్ద ఇంజినీరింగ్ బృందాలున్నాయి. అందరితోనూ ప్రజెంటేషన్ తీసుకొని.... దీన్ని మనం ఇతరులకంటే బాగా చేయగలుగుతాం అనే నమ్మకం కలిగాకే దాన్ని చేపడతాం.

**● రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఎవరున్నా మీ పనులు సాగుతున్నాయి. రాజకీయంగా ఎలా నెట్టుకొస్తున్నారు?**

మా సంస్థ చేస్తున్న టర్నోవర్‌లో 10 శాతం పనులే తెలుగు రాష్ట్రాల్లో చేస్తున్నాం. మిగిలినదంతా దేశంలోని 17 రాష్ట్రాల్లో, విదేశాల్లో చేస్తున్నాం. రాజకీయాలతో మాకు సంబంధం లేదు. ప్రభుత్వాలు టెండర్లు పిలుస్తాయి. మేం పోటీ పడతాం. ఏ రాజకీయ పార్టీతో మాకు సంబంధం లేదు. రకరకాలుగా అనుకుంటుంటారు. ఎవరో ఏదో అనుకుంటే మనం స్పందించాల్సిన అవసరం లేదు.

**● విదేశీ కంపెనీలతో పోల్చుకుంటే మన కంపెనీల పనితీరెలా ఉంటుంది?**

ఇన్‌ఫ్రా రంగం మేరకైతే విదేశాల్లోని వాటితో పోలిస్తే మన కంపెనీలు అన్నిరకాలుగా అద్భుతంగా ఉన్నాయి. వాళ్లకంటే మెరుగ్గా, వేగంగా పనిచేసే సామర్థ్యం మనకుందిప్పుడు. కానీ మన కంపెనీల పట్ల మనకే చిన్నచూపు!

**● అలా ఎందుకనుకుంటున్నారు?**

మౌలిక సదుపాయాల నిర్మాణంలోని మాలాంటి కంపెనీలను మనదేశంలో గుత్తేదారులంటూ చిన్నచూపు చూస్తారు. అదే యూరప్, అమెరికా తదితర దేశాల్లో దేశ అభివృద్ధి కారకులుగా పరిగణిస్తారు. ఎంతో విలువిస్తారు. అక్కడి కంపెనీలనే కాదు ... మనం అక్కడ పనులు చేస్తున్నా అంతే! ఎంతో ప్రాధాన్యమిస్తారు. కాంట్రాక్టర్‌లంటే మనదేశంలో ఒకరకమైన చులకన భావం ఉంటోంది. నిజానికి మేం దేశ అభివృద్ధి నిర్మాణ భాగస్వాములమే! అన్ని బిజినెస్‌లకంటే కష్టమైన వ్యాపారమిది.

**● అందుకు కారణమేంటనుకుంటున్నారు?**

చదువున్నా లేకున్నా ఎవరైనా ఈ రంగంలోకి వస్తారు. వైఫల్యాలు ఎక్కువ. ప్రొఫెషనలిజం లేకపోవటం వల్ల మీడియాతో పాటు అందరూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలను, ఆ పనులు చేసేవారిని చిన్నచూపు, తప్పుడు భావనతో చూస్తారు.

### అప్పుడే దేవుడు, ప్రకృతి సహకరిస్తారు

ఏ బిజినెస్ అయినా మనం పట్టుదలతో చిత్తశుద్ధితో చేస్తే విజయం సాధిస్తామనేది నా అనుభవం నేర్పిన పాఠం. మనసా వాచా కర్మణా.... చేసే పనిపై శ్రద్ధ ఉంటే ఫలితాలు వాటంతట అవే వస్తాయి. వంద కోట్లో రెండొందల కోట్లో టర్నోవర్ రాగానే మనకంటే గొప్పోళ్లు లేరు... మనం పట్టిందల్లా బంగారం అనుకొని గుడ్డిగా ప్రతి రంగంలో అడుగుపెట్టొద్దు. జాగ్రత్తగా మన శక్తి సామర్థ్యాలను, మన జట్టు సామర్థ్యాలను అంచనా వేసుకొని ముందుకు సాగితే ఎవరైనా ఏదైనా సాధించొచ్చు.

### అది మా చివరి లక్ష్యం

డబ్బులు సంపాదించటం మా లక్ష్యం కాదని చెబితే అబద్ధమవుతుంది. అది మా చివరి లక్ష్యం. ఎందుకంటే ఒకదశకు ఎదిగేదాకా డబ్బుల సంపాదనే కీలకం. ఇప్పుడు సంస్థ విశ్వసనీయతను, పేరును నిలబెట్టేలా చేయటం ప్రధానం. ఎందుకంటే మా సంస్థపై ఆధారపడి ఐదారు లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. కాబట్టి వారి క్షేమం, శ్రేయస్సు కీలకం.

**● కాళేశ్వరం ప్రాజెక్టులో మీ అనుభవాలేంటి?**

మాకు అన్ని ప్రాజెక్టులూ ఒకటే. కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు. ఓ నదినే దారి మళ్లిస్తున్నామన్నమాట. ఇది మాటలు కాదు. సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ కారణంగా అనుకున్నదానికంటే ఒక ఏడాది ముందే పూర్తవుతోంది. ఆయన ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇంజినీర్లతో స్వయంగా మాట్లాడతారు. చాలామంది ఇంజినీర్లకంటే ఆయనకు అవగాహన ఎక్కువ. ఏ నదిలో ఎక్కడ ఎంత లోతుందో, కాంటూర్లతో సహా నోటికుంటాయి. మా సంస్థకనే కాదు... ఇక్కడ పనులు చేస్తున్న ప్రతి కంపెనీకి కూడా ఇది అనుభవమే.

**● ఇంత బిజీ వ్యాపారాల నుంచి తీరికెప్పుడు చేసుకుంటారు?**

రోజుకు కచ్చితంగా 8 గంటలు నిద్రపోతా. గంట పాటు జిమ్ చేస్తా. దాదాపు 12 గంటలు ఆఫీసులో పనిచేస్తా. కడుపునిండా తింటా. క్రికెట్, బ్యాడ్మింటన్ ఆడుతుంటా. ఆదివారం పూర్తిగా కుటుంబానికే. పిల్లలతో ఎక్కువ గడపటానికి ప్రయత్నిస్తా. పెద్దబ్బాయి ఇంటర్‌కొచ్చాడు. రెండో వాడు తొమ్మిదో తరగతి. పెద్దగా దేనిగురించీ బెంగ పెట్టుకోను. టెన్షన్ పడను. ఎందుకంటే మనం చేయాల్సిన పనికి మన శక్తియుక్తులను నూటికి నూరుశాతం ఇవ్వటమే మనం చేయగలిగింది. అంతకుమించి చేసేదేమీ లేదు.

**● పిల్లలనూ ఇదే రంగంలోకి దింపుతారా?**

వాళ్లు మా రంగంలోకే రావాలని ఏమీ లేదు. వాళ్ల ఇష్టమైంది చేయొచ్చు. నేనేమీ రుద్దను. మాది ప్రొఫెషనల్ సంస్థ. ఇందులో వారసత్వం ఏమీ లేదు. ఈ విషయం మా సంస్థలోని వారందరికీ, కుటుంబంలోని వారికీ స్పష్టంగా తెలుసు. ఎవరు సమర్థులో వారే సంస్థను నడుపుతారు.

**● వయసు 50 దాటకుండానే ఇంత సాధించారు. ఇదంతా అదృష్టమా? మీ కష్టానికి ఫలితమా?**

లోకంలో నాకంటే కష్టపడేవాళ్లున్నారు. నాకంటే పట్టుదలతో పనిచేసే వారుంటారు. నాకంటే తెలివైనవాళ్లూ ఉన్నారు. కాబట్టి కష్టం... అదృష్టం అన్నీ కలిస్తేనే ఈ విజయమేమో!

**● రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనేమైనా...?**

రాజకీయాల్లోకి వెళ్లాలని ఇప్పటిదాకా అనుకోలేదు. ఇక ముందు అనుకోను. నా ప్రొఫెషన్ నాకిష్టం. ఈ కంపెనీని మరింతగా విస్తరించాలని అనుకుంటున్నాం. ఇప్పటిదాకా మన దేశం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న రంగాలపై మేం దృష్టిపెట్టాం. దేశంలో ఎలక్ట్రిక్ బస్సులిప్పుడు మా సంస్థ నుంచి వస్తున్నవే! దేశం మొత్తం మీద 500 బస్సులు సరఫరా చేశాం. మన తెలుగు రాష్ట్రాల్లోనూ తిరుగుతున్నాయివి. రక్షణ రంగానికి ఉపయోగపడే ఆధునిక పిస్తోళ్లు, రైఫిళ్ల (దిగుమతి చేసుకుంటున్నవి) తయారీ, రిగ్స్ తయారీ చేపట్టబోతున్నాం. మేకిన్ ఇండియాలో భాగంగా ఈ రంగాలకు విస్తరిస్తున్నాం. లక్ష మందికి నేరుగా ఉద్యోగాలు కల్పించాలన్నది నా ఆశ. ఆశయం.

### మన తెలుగు వాళ్లు శభాష్

పూర్తిస్థాయి సకల సౌకర్యాలతో జీవించటానికి ఎంతకావాలి? వ్యాపారం ఆరంభించినప్పుడు మనగురించి, మన కుటుంబం గురించి అని ఆలోచిస్తాం. కానీ ఒకదశకు చేరి విజయం సాధించిన తర్వాత ఎవరైనా తన గురించి, డబ్బు గురించి ఆలోచించటం కాకుండా... ఎంతమందికి ఉపయోగపడేలా తన సంస్థను తయారు చేయాలా అనే ఆలోచిస్తారు. మరింత మందికి ఉపాధి కల్పించటం, మరిన్ని కుటుంబాలకు సౌకర్యవంతమైన జీవనం కల్పించటం గురించి చూస్తారు. ఇప్పుడు మాదీ అదే బాట. విదేశాల్లో కొన్ని కంపెనీలను టేకోవర్ చేస్తున్నాం. ఇటలీలో, అమెరికాలో కొన్నింటిని తీసుకున్నాం. మన తెలుగువాళ్లలో సబ్జెక్ట్ పరిజ్ఞానమే కాకుండా, కష్టపడే తత్వం, సమస్యల్ని పరిష్కరించే తత్వం ఎక్కువ.

**● అమ్మానాన్న....**

అమ్మానాన్న ఇప్పటికీ ఊర్లో ఉంటారు. వ్యవసాయం చేస్తుంటారు. నేనూ ఇంటర్ దాకా వ్యవసాయం చూసుకున్నా.

- రేగళ్ల సంతోష్‌కుమార్, ఈనాడు హైదరాబాద్
ఫొటోలు: రాజమౌళి

Eenadu epaper

MORRIS GARAGES
Since 1924

# IT'S A HUMAN THING

**TO LISTEN** *AND RESPOND.*
**TO LEARN** *AND ADAPT.*
**TO KNOW** *AND SUGGEST.*

THE NEW MG **HECTOR**®

INTRODUCTORY PRICE, **STARTING AT**
**₹12.18 LAKHS (Petrol)* & ₹13.18 LAKHS (Diesel)***




MG SHIELD

**COMPLETE OWNERSHIP ASSURANCE**

5 Years/Unlimited kms Warranty<

5 Years/Unlimited kms Road Side Assistance

5 Labour Free Services#

- Best In Segment Cost Of Ownership°
  @₹0.45/km: Petrol^ | @₹0.49/km: Diesel^
- Industry Best 3 Year Maintenance Plans Starting At ₹8000°°
- 3-60 Plans: Assured Buy Back Value Of 60% After 3 Years At An Attractive Price°°°

HYBRID **INDIA's FIRST 48V HYBRID**

**25+ STANDARD SAFETY FEATURES**

**MG SUBSCRIBE VIA MYLES ZERO**

Contact us @ +918448513757

Book your MG **HECTOR**® today across 120+ centres | Log on to www.mgmotor.co.in

*Ex-Showroom India | <For commercial use cars, coverage upto 5 Years/1.5 Lakh Kms. The warranty coverage for 12V/48V battery, tyres is valid for 1 year, while for infotainment system is valid for 3 years. Terms and conditions apply | #For first 5 scheduled services | °Segment defined by comparable SUVs | ^Above is calculated upto 1 Lakh Kms of preventive maintaince in Delhi-NCR and includes parts, consumables, labour, taxes | °°Only for private vehicles. Please contact your nearest MG Dealer for details | °°°This is applicable only for private registered vehicles. POWERED BY CarDekho. Contact your nearest MG Dealer for specific package details and T&C. | In view of our policy of continously improving our products, we reserve the right to alter specifications, features & designs without prior notice and without liability. Please check details with your nearest MG dealer for latest information. Car color may vary than actual product due to print paper quality.

**South: Bangalore:** MG Bangalore Electronic City (+919611600055), MG Bangalore Kalyan Nagar (+919611600055), MG Bangalore ORR (+919611600055), MG Bangalore JP Nagar (+919611600055), MG Bangalore Chord Road (+919611600055) **Hyderabad:** MG Hyderabad Banjara Hills (+917288885566), MG Hyderabad Gachibowli (+917288885566) **Chennai:** MG Chennai Anna Salai (+917550073339), MG Chennai OMR (+917338733633) **Mysore:** MG Mysore (+919513444430) **Thrissur:** MG Thrissur (+916238810700) **Cochin:** MG Cochin (+916238600060) **Coimbatore:** MG Coimbatore (+919994999900) **Calicut:** MG Calicut (+916238810675) **Trivendrum:** MG Trivandrum (0471-2956888)

**Opening Shortly-** MG Vizag, MG Vijaywada, MG Madurai,